సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 7 । జూన్ । 2024





**'అధిక' సాంద్రత.. లాభం**

పత్తి సాగులో అధిక సాంద్రత విధానం ఎంతో మేలైంది. ఈ విధానంలో సాగు చేస్తే చీడపీడల నివారణతోపాటు అధిక దిగుబడి వస్తుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది. 8లో▸



**ఆదివాసీ గూడేల్లో 'కప్పతల్లి'**

ఆదివాసీ గూడేల్లో కప్పతల్లి ఆడారు. రోకలి బండకు కప్పను కట్టి ఇంటింటా తిరగగా మహిళలు దానిపై నీళ్లు పోసి వానలు కురవాలని మొక్కుకున్నారు. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
38.0/28.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పలుచోట్ల మేఘావృతమవుతుంది. వాతావరణం చల్ల బడుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### డీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్‌కు అర్హత గల అభ్యర్థులు ఈనెల 8నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్, నిర్మల్ డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 10న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### మామిడిగూడ బీటీ రోడ్డు పనులు ప్రారంభం



చదును చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ జీ గ్రామానికి రోడ్డు లేక ఆదివాసీ గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 19న 'సాక్షి'లో 'బీటీ రోడ్డు పనులేవి' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మామిడిగూడ జీ గ్రామ బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. మామిడిగూడ ఏ నుంచి మామిడిగూడ జీ వరకు ప్రొక్లెయినర్‌తో రోడ్డు చదును పనులు ముమ్మరం చేశారు. వారంరోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. కాగా, సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి మామిడిగూడ గ్రామ ఆదివాసీలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

### వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న అధికారులు

గుడిహత్నూర్: మండలంలోని సూర్యగూడలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఏఎస్పీ బీ సురేందర్‌రావ్, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా నాటు మందులు వేసుకోకుండా ఆస్పత్రికి వెళ్లాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, స్థానిక వైద్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. సమాజ హితం కోసం పోలీసులు అహర్నిశలు పని చేస్తున్నట్లు చెప్పారు. మద్యం, బీడీ, గుట్కా, గుడుంబాకు బానిసలై అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నగేందర్, వర్టికల్ డీఎస్పీ శ్రీనివాస్, సైబర్ క్రైం డీఎస్పీ హసీం, సీఐ భీమేశ్, ఎస్సైలు ఇమ్రాన్, సునీల్, శ్రీకాంత్, వైద్యులు అభిజిత్, శ్యాం, ప్రీతల్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కిషన్‌రెడ్డిని కలిసిన నగేశ్



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎంపీగా ఎన్నికైన గోడం నగేశ్ గురువారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 2019 ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ మెజార్టీ సాధించడం గొప్ప విషయమని నగేశ్‌ను కిషన్‌రెడ్డి అభినందించారు. నగేశ్ వెంట అశోక్ తదితరులున్నారు.

### విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఆదిలాబాద్‌రూరల్: కార్పొరేట్ కళాశాలల్లో సీట్లు సాధించిన పలువురికి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు గురువారం ఆయన కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సెస్సీలో 7 జీపీఏ సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్య అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎనిమిది మంది ఎంపిక కాగా ఇప్పటికే ఐదుగురికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు చెప్పారు.



ఆదిలాబాద్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క (ఫైల్)

# ఫలించని హస్తం ఎత్తుగడలు

- ఓడినా గణనీయంగా ఓట్ల శాతం
- ఎన్నికల ముందు అనేక వ్యూహాలు
- పార్టీలో హేమాహేమీల చేరికలు
- ఆసిఫాబాద్‌లో చేతికే మెజార్టీ
- మిగతా చోట్ల పార్టీకి రెండో స్థానం

**2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు**

| నియోజకవర్గం | అసెంబ్లీ | పార్లమెంట్ |
|---|---|---|
| సిర్పూర్ | 8,427 | 62,956 |
| ఆసిఫాబాద్ | 60,238 | 73,996 |
| ఖానాపూర్ | 58,870 | 61,587 |
| ఆదిలాబాద్ | 47,724 | 77,056 |
| బోథ్ | 32,797 | 65,204 |
| నిర్మల్ | 28,642 | 62,920 |
| ముధోల్ | 15,588 | 67,501 |

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం మూటగట్టుకుంది. అయితే బీజేపీకి గట్టి పోటీ ఇచ్చామన్న సంతృప్తి మాత్రం ఆ పార్టీలో కనిపిస్తోంది. ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని ఆ పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆదిలాబాద్ సిట్టింగ్ బీజేపీ స్థానంలో గెలవాలంటే అసెంబ్లీ నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇవ్వాలని పార్టీ అనేక ఎత్తుగడలు వేసింది. అయితే పార్టీ గెలవకపోయినప్పటికీ ఓట్ల శాతం పెరిగేందుకు ఇవి దోహదపడ్డాయన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతోంది.

**భారీగా పెరిగిన ఓట్ల శాతం..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖానాపూర్‌లో గెలుపొందగా, ఆసిఫాబాద్‌లో రెండో స్థానంలో, సిర్పూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్‌లో మూడో స్థానంలో నిలిచాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించారు. బీజేపీ సిట్టింగ్ స్థానం కావడం, అంతేకాకుండా గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లో వారి ప్రాతినిధ్యం ఉండడంతో సీతక్క ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని ముందుకు కదిలారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. ఒక దశలో తమకు ప్రజాదరణ విస్తృతంగా ఉందని, గెలవడం ఖాయమని పలు వేదికల ద్వారా ఆమె స్పష్టం చేస్తూ వచ్చారు. అంతేకాకుండా ఈ సెగ్మెంట్ పరిధిలోకి వచ్చే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రణాళికా ప్రకారం ముందుకెళ్లారు. ఇవన్నీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగేందుకు దోహదపడ్డాయే కానీ.. విజయాన్ని మాత్రం అందుకోలేక పోవడం ఆ పార్టీ శ్రేణులకు నిట్టూర్పు కలిగించింది.

**హేమాహేమీల చేరిక..**

పార్లమెంట్ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందే మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీలో చేరారు. ప్రధానంగా నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో ఈ చేరికల ద్వారా పార్టీకి బలం చేకూరుతుందని ఆశించారు. దానికి తగ్గట్టే అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు గణనీయంగా ఓట్లు పడ్డాయి. సిర్పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదంకెల ఓట్లనూ అందుకోలేక పోయింది. కానీ.. ఈ నియోజకవర్గంలో గణనీయంగా ఓటు బ్యాంక్‌ను పెంచుకుంది. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం కలిగిస్తోంది. ఆదిలాబాద్, బోథ్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు గణనీయంగా పెరగడంతో ఇక్కడ ఇన్‌చార్జీలుగా ఉన్న కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్‌కు పార్టీలో బలం చేకూర్చింది. ఖానాపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల నాటి ఓట్లను మించి కాంగ్రెస్ సాధించినప్పటికీ ఇక్కడ బీజేపీకి అత్యధికంగా ఓట్లు లభించడంతో ఏకైక ఎమ్మెల్యే స్థానంలో కాంగ్రెస్‌కు కొంత నిరాశ ఎదురైంది. ఆసిఫాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికలకు మించి ఓట్లు రావడం, అంతే కాకుండా ఈ నియోజకవర్గంలోనే పార్టీకి మిగతా చోట్ల కంటే అత్యధిక ఓట్లు రావడంపై సంతోషం వ్యక్తమవుతోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ విస్తృతంగా కృషి చేయడంతోనే ఇక్కడ బీజేపీని మించి మెజార్టీ వచ్చిందన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది.

# బదిలీలు, ఉద్యోగోన్నతులకు కసరత్తు

- రెండురోజుల్లో షెడ్యూల్ విడుదల!
- నిలిచిన ప్రక్రియ ముందుకు సాగేనా?
- ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా తయారీలో విద్యాశాఖ అధికారులు



సీనియార్టీ జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కోసం రెండురోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు సీనియార్టీ జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. గత సెప్టెంబర్, అక్టోబర్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టగా, కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించగా మధ్యలోనే నిలిచింది. ఇటీవల కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం, ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ ప్రక్రియ తెరపైకి రానుంది. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రక్రియ చేపట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు సమాచారం.

**17 రకాల వివరాలతో...**

ఉపాధ్యాయుల 17 రకాల ప్రొఫార్మా వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఉద్యోగోన్నతులు పొందే ఉపాధ్యాయులపై ఏమైన కేసులున్నాయా? సస్పెండ్ అయ్యారా? కేసులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారా? తదితర వివరాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, వైకల్యం గల ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు. కాగా, జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు 3,028 ఉండగా, ప్రస్తుతం 2,467 మంది పనిచేస్తున్నారు. 561 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదివరకే 55మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు లభించాయి. వీరిలో జెడ్పీ యాజమాన్యంలో 45 మంది, ప్రభుత్వ యాజమాన్యంలో 10 మంది ఉన్నారు. కాగా, సీనియార్టీ జాబితాలోని ఎస్సీ ఉపాధ్యాయులు 15శాతం, ఎస్టీ ఉపాధ్యాయులు 10శాతం, వైకల్యమున్న వారు నాలుగు శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగోన్నతులు పొందనున్నారు. ఈ లెక్కన ఎస్సీ ఉపాధ్యాయులు 49మంది వరకు, ఎస్టీ ఉపాధ్యాయులు 17 మంది వరకు, పీహెచ్‌సీ కోటాలో ఎనిమిది మంది ప్రమోషన్లు పొందే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**ప్రక్రియ కొనసాగేనా?**

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం అనుమానంగానే కనిపిస్తోంది. కొందరు ఎస్జీటీలు కోర్టుకు వెళ్లడంతో సెప్టెంబర్, అక్టోబర్‌లో జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతులు నిలిచాయి. ఎస్జీటీలు ప్రమోషన్లు పొందాలంటే టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని ఎన్‌సీఈఆర్టీ నిబంధన విధించిన విషయం తెలిసిందే. విద్యాహక్కు చట్టం ప్రకారం ఈ నిబంధనలు పాటించాల్సి ఉందని గతంలో కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించగా 2010 కంటే ముందు నియమితులైనవారికి టెట్ అవసరం లేదని తీర్పు వచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. దీంతో ఉద్యోగోన్నతులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. అలాగే పండిత పోస్టులకు సంబంధించి కూడా భాషా పండితులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెబుతున్నారు. అయితే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నప్పటికీ మళ్లీ కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బదిలీల ప్రక్రియ చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం అనుమానమే. కాగా, బదిలీలు చేపట్టిన సమయంలో స్కూల్ అసిస్టెంట్లు వారు బదిలీ అయిన స్థానానికి ఇంకా రిలీవ్ కాలేదు. జిల్లాలో 350 మంది ఎస్ఏలకు బదిలీలు జరగగా, ఇంకా 290 మంది వరకు పాత చోటనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారు నిరాశకు గురవుతున్నారు. సబ్‌స్టూట్ లేకపోవడంతో వారిని రిలీవ్ చేయడం లేదని తెలుస్తోంది. బడులు తెరిచే నాటికి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేలా ప్రభుత్వం సుముఖంగాఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

**బడులు గాడిలో పడేనా?**

జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈనెల 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 561 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తేనే డీఎస్సీ ద్వారా ఖాళీ పోస్టులు భర్తీ కానున్నాయి. అయితే ఇప్పటికే ప్రభుత్వం టెట్ నిర్వహించింది. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటన చేసిన విషయం తెలిసిందే. నిరుద్యోగుల నుంచి డీఎస్సీ కోసం దరఖాస్తులు స్వీకరించింది. డీఎస్సీ పరీక్షకు సంబంధించి ఇంకా షెడ్యూల్ విడుదల కాలేదు. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ అయితేనే నిరుద్యోగులతో పాటు సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు మేలు జరగనుంది. కొన్నేళ్లుగా డీఎస్సీ లేకపోవడంతో సర్కారు బడుల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఉపాధ్యాయులు సరిపడా లేక విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.

**ఇంకా ఆదేశాలు రాలేదు**



ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ముందుగా సీనియార్టీ జాబితా సిద్ధం చేస్తున్నాం. షెడ్యూల్ వచ్చిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రక్రియ ప్రారంభిస్తాం. – ప్రణీత, డీఈవో

# అమ్మ ఆదర్శ పనులు నాణ్యతతో చేపట్టాలి

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాంల తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపడుతున్న పనుల వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకుని యుద్ధప్రాతిపదికన వాటిని పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు లక్ష్యంగా నిర్దేశించుకుని స్కూళ్లు తెరిచేలోపు పూర్తి చేయాలని సూచించారు. నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, పనులు చేపట్టిన తర్వాత ఫొటోలు తీసి పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించాలని ఆదేశించారు. స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యత స్వయం సహాయ సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎన్ని జతల యూనిఫాంలను సిద్ధం చేశారని, ఇంకా ఎన్ని జతల బట్టలు కుట్టాల్సి ఉందని, మెటీరియల్ అందుబాటులో ఉందా? నిత్యం సగటున ఎన్ని యూనిఫాంలు తయారు చేస్తున్నారు' తదితర వివరాలు తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు యూనిఫాంల తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. యూనిఫాంల తయారీకి సంబంధించి రోజువారీగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి ప్రణీత తదితరులున్నారు.

**సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలి**

తాంసి: రైతులకు సరిపడా అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని పరిశీలించారు. సంఘం ద్వారా అందిస్తున్న సేవలను సీఈవో కేశవ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల నిల్వల వివరాలు పరిశీలించారు. యూరియా నిల్వ లేకపోవడంతో త్వరగా తెప్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏవో రవీందర్ తదితరులున్నారు.

**రేపు జిల్లా వ్యవసాయాధికారితో సాక్షి 'ఫోన్‌ఇన్'**



డీ పుల్లయ్య , జిల్లా వ్యవసాయాధికారి

కైలాస్‌నగర్: వానాకాలం సీజన్–2024 ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని రైతాంగం ఏ సమయంలో విత్తుకోవాలి.. పత్తి, సోయా, కంది లాంటి పంటల సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుమందులను ఏ మేరకు వినియోగించాలి.. నకిలీ విత్తనాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై 'సాక్షి' ఈ నెల 8వ తేదీన జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్యతో 'ఫోన్‌ఇన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలోని రైతులు నిర్ణీత సమయంలో జిల్లా వ్యవసాయాధికారిని ఫోన్‌లో సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకునే వెసులుబాటు ఉంది.

**సంప్రదించాల్సిన నంబర్ :**
**7288894000**
**సమయం : ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు**

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- కలెక్టర్ రాజర్షి షా
- తాంసిలో బడిబాట



పాఠశాలలో చేరిన విద్యార్థులతో కలెక్టర్ రాజర్షి షా, అధికారులు


తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులతో కలిసి బడిబాట ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాలిసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థిని పల్లవి, ఆమె తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల దగ్గరకు వెళ్లి యూనిఫాం కుట్టు పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడీడు పిల్లలు పాఠశాలలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 7,500 మందికిపైగా పిల్లలను అంగన్‌వాడీల నుంచి ప్రైమరీ పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీఈవో ప్రణీత, పీఆర్ డీఈఈ శివరాం రాథోడ్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఐసీడీఎస్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, పీఆర్ ఏఈ మజర్, ఏవో రవీందర్, డీడబ్ల్యూవో సవిత, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం**



చాందా(టీ) పాఠశాలకు చెందిన ఎస్సెస్సీ 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రవీణ్, మహేశ్, గణపతి, ప్రశాంత్, సాంబన్న, లక్ష్మి, గౌతమి, నాగమ్మ, కవిత, ప్రియాంక, స్వరూప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్‌రూరల్

# సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకుని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. 'ఫోన్ ఇన్‌విత్ యువర్ ఎమ్మెల్యే' అనే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడెం, జన్నారం తదితర మండలాలు, వివిధ గ్రామాలకు చెందినవారు, ఉద్యోగులు ఫోన్ చేసి ఎమ్మెల్యేతో సమస్యలు తెలిపారు. నీరు, రోడ్డు, డ్రైనేజీ, కరెంట్, మిషన్ భగీరథ, జీవో నంబర్–3, ఫారెస్ట్, జీవో నంబర్–317 తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తేగా సీఎం, మంత్రుల చొరవతో దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తలమడుగు: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని డీఆర్డీవో కుటుంబరావు సూచించారు. గురువారం సుంకిడి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్, జులైలో మొక్కలు నాటే ప్రదేశాలను ఇప్పటి నుంచే గుర్తించాలన్నారు. నర్సరీల్లో ఎదగని మొక్కలను సమూహం నుంచి తీసివేసి కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. పెరిగిన మొక్కల వేర్లు భూమి వరకు నాటుకుంటూ వాటిని ఓ వైపునకు ఏర్పాటు చేయాలని సూచించారు. 2024 టార్గెట్‌లో కమ్యూనిటీ, అవెన్యూ ప్లాంటేషన్‌లో కానుగ, పండ్ల మొక్కలు నాటాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, మొక్కల నిర్వహణ, మెళకువలు, తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శేఖర్, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ ఆషన్న, రామయ్య ఉన్నారు.

## క్లుప్తంగా

### 30 పత్తి విత్తన బ్యాగులు చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రైల్వే గేట్ సమీపంలో ఈ నెల 4న 30 పత్తి విత్తన బ్యాగులు చోరీకి గురైనట్లు బాధితుడు గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఉట్నూర్‌కు చెందిన భార్గవి సీడ్స్ యజమాని శ్రీనివాస్ ఈ నెల 4న పత్తి విత్తనాల కోసం తన వాహనాన్ని ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి పంపించాడు. డ్రైవర్ శ్రీనివాస్ ఫర్టిలైజర్ నుంచి 30 పత్తి విత్తన బ్యాగులు తీసుకుని దేశ్‌ముఖ్ జిన్నింగ్ వైపు వెళ్లాడు. అదే సమయంలో రైల్వే గేటు పడడంతో ఐచర్ వాహనాన్ని అక్కడ నిలిపాడు. ఈ క్రమంలో వాహనంలో ఉన్న 30 గోల్డ్‌కార్ట్ బీజీ-2 విత్తన బ్యాగులు చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని లాండ సాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి రెండు ఆటోల్లో 11 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన షౌకత్, అస్లం, అఫ్రోజ్‌లపై కేసు నమోదు చేయడంతో పాటు బియ్యం, ఆటోలను సీజ్ చేసినట్లు వివరించారు.

### పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనంలో ఇరుకుగా పశువులు

బేల: పరిమితికి మించి పశువులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని టాక్లీ రెవెన్యూ గ్రామ శివారులో జాతీయ రహదారి మార్గంలో ఐచర్ వాహనాన్ని తనిఖీ చేయగా 16 ఎద్దులను కుక్కేసి ఆదిలాబాద్ వైపు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎద్దులను గుడిహత్నూర్‌లోని గోశాలకు, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ గంగుల రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని చిట్యాల బోరిలో కుమ్ర అర్జున్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గురువారం ఉదయం మేతకు వెళ్లిన ఆవు చుక్కబొట్ల వెంకటరమణ చేనులో మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

### ఒకరి రిమాండ్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లోని పైడిపెల్లి బీట్‌లో రెండు టేకు చెట్లు నరికిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌డీవో, మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ నెల 1న పైడిపెల్లి బీట్‌లో వెడ్మ లక్ష్మణ్ అనే వ్యక్తి టేకు చెట్లను కోసి పడగొట్టాడు. రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితున్ని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.



# మృత్యు పిడుగు

పిడుగు మృత్యువై ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నలుగురిని బలి తీసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లిన యువ రైతులను కబళించింది. వేర్వేరు ప్రాంతాల్లో గురువారం పిడుగులు పడి దంపతులు, యువ రైతు, బాలుడు మృతి చెందారు. మరోచోట పిడుగుపాటుకు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరంతా వ్యవసాయ పనుల్లో ఉండగానే పిడుగులు పడడం గమనార్హం.

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో నలుగురు మృతి
- డొంగర్‌గామ్‌లో దంపతులు బలి..
- దిలావర్‌పూర్‌లో యువరైతు..
- మేకలు మేపేందుకు వెళ్లి బాలుడు..
- మరో ఇద్దరికి గాయాలు...


తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి


అనక సంతోష్, స్వప్న మృతదేహాలు

**చేను వద్దకు వెళ్లి శవమై..**

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన యువ దంపతులు అనక సంతోష్ (27), స్వప్న(24) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం సాయంత్రం చేను వద్దకు వెళ్లారు. పనులు చేస్తుండగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో పనులు ఆపేసి.. సమీపంలో ఉన్న టేకుచెట్టు కింద ఉన్న గుడిసెలోకి వెళ్లారు. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చేను వద్దకు వెళ్లిన దంపతులు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో వర్షం తగ్గిన తర్వాత కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి చూడగా గుడిసెలో ఇద్దరూ శవమై కనిపించారు. దీంతో బోరున విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**అనాథ అయిన ఏడాది చిన్నారి..**

సంతోష్, స్వప్న మృతితో వారి ఏడాది వయసున్న కూతురు భాను అనాథ అయింది. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు రోదిస్తుంటే.. ఆ చిన్నారి ఏం జరిగిందో తెలియక బిత్తర చూపులు చూడడం అందరినీ కదిలించింది. పొలం వద్ద నుంచి వచ్చాక అమ్మ పాలు పడుతుందనుకుంటే.. ఇంకా రాలేదని అమ్మ రాక కోసం ఎదురు చూస్తున్నట్లు చిన్నారి అమాయకపు చూపులు చూసి అందరి కళ్లు చెమర్చాయి.


అనక సంతోష్, స్వప్న(ఫైల్)

**ఆకోలిలో ఇద్దరికి గాయాలు**

జైనథ్: మండలంలోని ఆకోలిలో పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బాబారావ్, సంతోష్ పంటచేనులో పనులు చేస్తుండగా వర్షం కురియడంతో ఓ మామిడి చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నారు. కొంతదూరంలో పిడుగు పడటంతో సంతోష్ కాలికి గాయంకాగా బాబారావ్ స్పృహ కోల్పోయాడు. సంతోష్ తన భార్యకు ఫోన్ చేసి తాము పిడుగు పాటుకు గురయ్యామని చెప్పడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

**అంబారిపేట్‌లో నాలుగు మేకలు..**

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో పిడుగుపాటుతో నాలుగు మేకలు, ఒక గొర్రె పిల్ల మృతి చెందింది. మృతి చెందిన జీవాల విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.


కడెం: మృతి చెందిన మేకలు

**బరంపూర్‌లో ఎద్దు..**

తలమడుగు: మండలంలోని బరంపూర్‌లో సంపతి రామన్న యాదవ్ తన పంటచేనులో ఎద్దులను కట్టివేశాడు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగుపడి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### తండ్రికి సాయం చేద్దామని వెళ్లి యువరైతు..


ప్రవీణ్ (ఫైల్)

దిలావర్‌పూర్‌: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన యువ రైతు మూడపెల్లి ప్రవీణ్(28) గురువారం తన తండ్రి సాయన్నతో కలిసి పంటపొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి దున్నించేందుకు వెళ్లాడు. ప్రవీణ్ దుక్కిలో జీలుగ చల్లుతుండగా ఉరుములతో కూడిన భారీ వర్షంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. పక్కనే ఉన్న తండ్రి ట్రాక్టర్ డ్రైవర్ సహాయంతో నిర్మల్ తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య అశ్విని, ఏడాది వయసున్న కూతురు ఉన్నారు.

### మేకలను మేతకు తీసుకెళ్లి బాలుడు..


శ్రీ(ఫైల్)

తానూరు: మండలంలోని ఎల్వత్‌కు చెందిన మంగీర్‌వాడ్ శ్రీ (10) తన తాతతో మేకలు మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తుండగా కురిసిన వర్షంలో పిడుగుపడడంతో బాలుడితో పాటు రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై సందీప్, ఆర్ఐ మోహన్‌సింగ్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### సరస్వతీ అమ్మవారి ఒడిబియ్యం లెక్కింపు


లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బాసర: బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడి బియ్యం హుండీని గురువారం లెక్కించారు. ఒడి బియ్యం 55 క్వింటాళ్లు, ఎండు కుడుకలు 319 కిలోలు, ఖర్జూరపండ్లు 39 కిలోలు, బరడి పోకలు 23 కిలోలు, బాదాములు 14 కిలోలు, పసుపు కొమ్ములు 65 కిలోలు సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నీట్‌లో సత్తా చాటిన న్యూవెల్మల్ వాసి


గోలి సాయి ఆకాష్

సోన్‌: మండలంలోని న్యూవెల్మల్ గ్రామానికి చెందిన గోలి సాయన్న, గంగామణి దంపతుల కుమారుడు గోలి సాయి ఆకాష్ ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 500 మార్కులు సాధించి సత్తా చాటాడు. దంపతుల కుమార్తె గోలి సాయి వెన్నెల నిజామాబాద్‌లోని మేఘన డెంటల్ కాలేజీలో బీడీఎస్ నాలుగో సంవత్సరం, రెండో కుమార్తె అక్షర సాయి జగిత్యాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు వైద్యవిద్యను అభ్యసించడంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు.

### బీట్ అధికారిపై దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

జన్నారం: ఈ నెల 2న తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న బీట్ అధికారి సాయికుమార్, వాచర్ ఉత్కూరి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన ముగ్గుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. దండెపల్లి మండలం మేదరిపేటకు చెందిన ఆడెపు శ్రావణ్‌కుమార్, నర్సాపూర్‌కు చెందిన తీగల ఉదయ్, నెల్కి వెంకటాపూర్‌కు చెందిన దొరిసెట్టి శ్రీనివాస్‌లను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

# గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

- డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: నిషేధిత గుట్కా విక్రయించినా నిల్వ ఉంచినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి డాల్డా కంపెనీ ప్రాంతంలో దాడులు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన మజా కంపెనీ టొబాకొను కల్తీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. యంత్రంతో పాటు ఇర్ఫాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో రూ.25 లక్షల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టూటౌన్ సీఐ అశోక్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు డాల్డా కంపెనీ ప్రాంతంలోని గుండావార్ రాకేష్ జిన్నింగ్ మిల్లులో తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4.40 లక్షల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి రిజ్వాన్ పరారీలో ఉన్నాడు.

**గుట్కా స్వాధీనం**

ఆదిలాబాద్‌టౌన్‌: అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలో దాడులు నిర్వహించి షేక్‌యాసిన్ దాచి ఉంచిన గుట్కా నిల్వలను పట్టుకున్నారు. గుట్కా విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి


జాఫర్ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన సయ్యద్ జాఫర్ (35) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన జాఫర్ గురువారం మధ్యాహ్నం సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని రోదించిన తీరు అందరిని కంటతడి పెటించింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

### జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

సారంగపూర్‌: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ధని గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మి (51) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. భర్త వెంకటరమణ గతంలోనే మృతి చెందగా ఉన్న ఒక్క కుమారుడు అవినాష్ ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. దీంతో సేవచేసేవారు లేక, ఒంటరితనం భరించలేక గురువారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రెండో ఎస్సై

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామానికి చెందిన చంద మీనమ్మ (76) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. గంపలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న మీనమ్మ గురువారం పట్టణంలో గంపలు అమ్ముకుని ఇంటికి తిరిగివస్తున్నక్రమంలో ఉత్కూర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్‌చౌక్ వైపుకు వెళ్తున్న ఆటో వెనకనుంచి ఢీకొట్టింది. కిందపడిపోవడంతో గమనించిన స్థానికులు ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ‘అధిక’ సాంద్రత.. లాభం

- పెరగనున్న సాగు విస్తీర్ణం
- తగ్గనున్న కూలీల ఖర్చు


కోట శివకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, బెల్లంపల్లి

బెల్లంపల్లి: ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకాయి. వర్షాల రాకకు ముందస్తుగా వేసవి దుక్కులు దున్ని సేంద్రియ ఎరువులు పోసుకుని పంటల సాగుకు రైతులు చేలను సిద్ధం చేసి ఉంచుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పత్తి ప్రధాన పంటగా పండిస్తున్నారు. పత్తి సాగులో అధిక సాంద్రత విధానం ఎంతో మేలైంది. ఆ తీరుగా పత్తి సాగు చేయడం వల్ల పంట దిగుబడి పెరిగి, చీడ పీడల నివారణకు అవకాశాలు ఉంటాయి. కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. పంట కాలపరిమితి తగ్గి రెండో పంట సాగు చేసుకోవడానికి వీలవుతుంది. అధిక సాంద్రతతో పత్తి సాగు చేయడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉంటాయని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివ కృష్ణ తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే...

**మొక్కల సంఖ్య పెరిగి...**

అధిక సాంద్రత పత్తి సాగు సాధారణ పత్తి సాగుకు భిన్నంగా ఉంటుంది. మొక్కల మధ్య, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చే విధంగా విత్తు కోవడానికి వీలవుతుంది. సాధారణ పత్తి సాగులో వరుసల మధ్య 90 సెం.మీ, మొక్కల మధ్య 60 సెం.మీ ఎడం పెట్టినప్పుడు ఎకరాకు గరిష్ఠంగా 7,400 మొక్కలు మాత్రమే వస్తాయి. అదే అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం వల్ల 90 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ ఎడంతో విత్తుకుంటే ఎకరాకు గరిష్ఠంగా 29,629 మొక్కలు వస్తాయి. ఈ పద్ధతిలో విత్తన మోతాదు ఎకరానికి 2.5 కిలోలు అవసరం అవుతుంది. వర్షాధార తేలిక నేలలు, భూసారం అత్యల్పంగా ఉండే చెలక నేలలకు చాలా అనుకూలం. అలాంటి నేలల్లో మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగవు. తద్వారా మొక్కల సంఖ్య పెరగడంతోపాటు పంట దిగుబడి పెరిగే వీలుంది. 8 నుంచి 10 కాయలు వచ్చిన మొక్కల సంఖ్య అధికంగా ఉండటం వల్ల ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది.


అధిక సాంద్రతతో సాగు చేసిన పత్తి పంట (ఫైల్)

**అధికసాంద్రత సాగుతో కలిగే ప్రయోజనాలు**

- అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పంట నవంబర్/డిసెంబర్ నెలలో చేతికి వస్తుంది.
- ఒకే సారి పూత, కాత రావడం వల్ల గులాబీ రంగు పురుగు తాకిడి నుంచి పంట బయట పడుతుంది.
- నీటి వసతి ఉన్న చోట రెండో పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది.
- డిసెంబర్‌లో పంట తీసిన తర్వాత రెండో పంటగా పెసర, మినుము వంటి అపరాల పంటలను సాగు చేస్తే నేల సారవంతమవుతుంది.
- తర్వాత విత్తుకునే పంటకు ఎరువుల మోతాదు తగ్గించుకునే అవకాశాలు ఉంటాయి.
- రెండో పంట మార్పిడి చేయడం వల్ల నిరంతరంగా పెరిగే గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. ఆ తీరుగా మరుసటి ఏడాది ఆశించే గులాబీ రంగు ఉధృతి తగ్గుముఖం పడుతుంది.
- ఈ పద్ధతి వల్ల ఎకరాకు సుమారు 30 నుంచి 40 శాతం అధిక దిగుబడిని పొందే అవకాశం ఉంది.

**సాధారణ సాగుతో కలిగే ప్రతికూలతలు**

సాధారణ పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల పలు ప్రతికూల సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. మూడు, నాలుగు సార్లు పత్తి సేకరణకు కూలీల అవసరం ఏర్పడుతుంది. తద్వారా కూలీల ఖర్చు పెరుగుతుంది. సాధారణ పత్తి సాగు కాలపరిమితి ఎక్కువ రోజులు ఉండటంతో రెండో పంట సాగు చేయడానికి వీలు ఉండదు. సాగు వ్యవధి ఫిబ్రవరి, మార్చి వరకు పెంచడం వల్ల పత్తి నాణ్యత తగ్గిపోయే అవకాశాలు అధికంగా ఉంటాయి. మరోవైపు గులాబీ రంగు పురుగు ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంటుంది.

**అధిక సాంద్రతతో అధిక దిగుబడి**

అధిక సాంద్రత విధానంలో పత్తి చదరపు మీటరుకు మొక్కల సంఖ్య పెరిగి ఎత్తును 4 నుంచి 5 అడుగుల వరకు నియంత్రించడానికి వీలవుతుంది. తద్వారా మొక్కలు త్వరగా కాపుకు వచ్చి కాయలు నిలుపుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఒకేసారి పత్తి పక్వానికి వస్తుంది. కాయ బరువు అధికంగా ఉంటుంది. తద్వారా ఎకరాకు కనిష్ఠంగా 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే వీలుంటుంది. అయితే ప్రాంతాన్ని బట్టి, పాటించే యాజమాన్య పద్ధతిని బట్టి పంట దిగుబడి మారుతూ ఉంటుంది.

# సాగులో పాటించాల్సిన పద్ధతులు

చెన్నూర్‌రూరల్‌: వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు పాటించాల్సిన సలహాలు, సూచనలను చెన్నూర్ వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్‌స్టన్ వివరించారు.

**రైతులు పాటించాల్సిన సూచనలు**

- మేలు రకం విత్తనాలు వాడాలి.
- తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయించాలి.
- పంటచేనులో విత్తన సాళ్ల దూరం పాటించాలి.
- ఏటా పంట మార్పిడి చేయాలి.
- అవసరమైన మేరకే ఎరువులు వాడాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రశీదులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి.


లింగంపల్లి సమీపంలో సిద్ధం చేసిన దుక్కి

- రైతులు పంట వేసే సమయంలో తప్పని సరిగా వ్యవసాయాధికారులను సంప్రదించాలి.
- సేంద్రియ ఎరువులను వాడితే ఖర్చు ఆదాతో పాటు దిగుబడి పెరుగుతుంది.